సాక్షి
ప్రకాశం
శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



కళ్యాణమస్తు

వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫాతో పేద కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయి. జిల్లాలో 951 మందికి లబ్ధి చేకూరింది. - IIలో..



నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. కేంద్రీయ విద్యాలయంలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
37/29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మార్కెట్ యార్డ్ అభివృద్ధికి రూ.1.52 కోట్లు

- రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: స్థానిక మార్కెట్ యార్డు అభివృద్ధికి రూ.1 కోటి 52 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ నుంచి సంబంధిత అధికారులకు ఆదేశాలు అందాయన్నారు. వెయ్యి టన్నుల సామర్థ్యం ఉన్న గోడౌన్ నిర్మాణానికి రూ.68 లక్షలు, ఓపెన్ ప్లాట్ ఫార్మ్ ఏర్పాటు చేసేందుకు రూ.24 లక్షలు, రైతులు తమ ఉత్పత్తులను వేలం వేసుకోవటానికి వీలుగా ప్లాట్ ఫార్మ్ నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరు చేశారని, త్వరలో ఈ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విదేశీ విద్యకు ఎంపికైన రాయవరం విద్యార్థిని

- అభినందించిన మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీ



నవీనను అభినందిస్తున్న మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: మార్కాపురం మండలం రాయవరం గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ధారా నవీన విదేశీ విద్యకు ఎంపికవడంపై పురపాలక శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అభినందించారు. శుక్రవారం విద్యార్థిని నవీనను తీసుకొని ప్రిన్సిపల్ ఆశాలత, సిబ్బంది కలిసి మంత్రి క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్క విద్యార్థికి లక్షన్నర నగదు, ఒక ట్యాబ్ అందజేస్తున్నారన్నారు. రాష్ట్రంలో విదేశీ విద్యకు ఐదుగురు ఎంపిక కాగా అందులో మార్కాపురం ప్రాంతానికి చెందిన విద్యార్థిని నవీన ఉండటం అదృష్టమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కాశీ అన్నపూర్ణ, సుచరిత, రంగయ్య, పెద్దారవీడు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కృష్ణారెడ్డి, సుంకేసుల సర్పంచ్ జీ రమేష్ తదితరులు ఉన్నారు.

23న ఇగ్నైట్ యంగ్ మైండ్స్ జిల్లా స్థాయి పోటీలు

మార్కాపురం టౌన్: విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు ఇగ్నైట్ యంగ్ మైండ్స్ ఆధ్వర్యంలో ఈనెల 23న మార్కాపురంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయిలో పోటీలకు అన్నీ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి కోరారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వివిధ మండలాల ఎంఈఓలు, హెచ్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి నెలా నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా ఈనెల 23న జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నామని, వ్యాసరచన, క్విజ్, ఫోక్‌డాన్స్‌ల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. విధి విధానాలు రూపొందించాలని కోరారు. విజయవంతం అయ్యేందుకు అందరూ కృషిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో మార్కాపురం ఎంఈఓలు రాందాస్ నాయక్, శ్రీనివాసులు, పెద్దారవీడు ఎంఈఓ సుబ్రహ్మణ్యం, తర్లుపాడు ఎంఈఓ సుబ్బారావు, హెచ్ఎం శ్రీనివాస మల్లికార్జున్, చంద్రశేఖర్ రెడ్డి, స్నేహ నాట్యమండలి ట్రైనర్ ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రగతిలో వైఎస్సార్ రూపం..

జిల్లా అభివృద్ధిలో చెరగని సంతకం ఆయనది. ఐదున్నరేళ్ల పాలనలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతి అడుగూ ప్రగతి బాటే..బీడువారిన భూములను సస్యశ్యామలం చేసేందుకు నాడు ఆయన వేసిన అడుగులు..నేడు ఫలప్రదం అవుతున్నాయి. నాడు జలయజ్ఞంలో పురుడుపోసుకున్న వెలిగొండ ప్రాజెక్టు నేడు ఫలాలు అందించేందుకు సిద్ధమవుతోంది. అంతేకాదు..లయతప్పిన పేద గుండెకు ఆరోగ్యశ్రీ తో ఊపిరిలూదిన దైవంలా...

చదువు "కొనలేక"పేదింట చిన్నబోయిన అక్షరానికి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో అండగా నిలిచి...వయసుడిగిన నాడు ఆసరాలేక వృద్ధాప్యం ఉసూరుమంటే... ఇంటికి పెద్ద కొడుకై ఆదుకున్న ఆపన్న హస్తంగా నిలిచారు...ఆరుగాలం శ్రమించినా ఉరితాడే దిక్కైన పేద రైతు కష్టాలు ఒక్క సంతకంతో మాఫీ చేసిన నాయకుడిలా...తెలుగుదనానికి నిండైనా రూపంలా ఆ మహానేత వైఎస్సార్ నిలిచారు. ఆ మహానేత 14వ వర్ధంతి సందర్భంగా జిల్లాకు వైఎస్సార్ అందించిన అభివృద్ధి ఫలాలపై "సాక్షి" ప్రత్యేక కథనం.

- తండ్రి వైఎస్సార్ ఆశయాలను సాకారం చేస్తున్న తనయుడు సీఎం వైఎస్ జగన్
- గుండ్లకమ్మ ద్వారా సస్యశ్యామలంగా పంటలు
- పలు గ్రామాలకు తాగునీటి అవసరాలు తీరుస్తున్న వైనం
- పూర్తి కావస్తున్న వెలిగొండ రెండో టన్నెల్ పనులు
- వ్యవసాయాన్ని పండుగ చేసి చూపిన గొప్ప నేత దివంగత డాక్టర్ వైఎస్సార్
- జిల్లా అభివృద్ధిలో తండ్రిని మించిన తనయుడు సీఎం వైఎస్ జగన్
- నేడు దివంగత మహానేత డాక్టర్ వైఎస్ఆర్ 14వ వర్ధంతి



రామతీర్థం ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ రాజశేఖరరెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా అభివృద్ధికి నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి పునాదులు వేస్తే నేడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి వాటిని పూర్తి చేసేందుకు ఎక్కడా వెనకడుగు వేయకుండా ముందుకు దూసుకుపోతున్నారు. అటు సాగునీటి ప్రాజెక్టుల విషయంలోనూ...ఇటు ఇతర అభివృద్ధి, సంక్షేమ పథకాల విషయంలోనూ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా పాలన సాగిస్తున్నారు. సాగు, తాగు నీటి ప్రాజెక్టులు, రైతన్నల విషయంలోనూ మహానేత ఎంతో ముందు చూపుతో అడుగులు ముందుకు వేస్తే...ఆయన తనయుడు సీఎం వైఎస జగన్ గ్రామ స్వరాజ్యాన్ని గ్రామ లోగిళ్ల ముంగిటకే తీసుకెళ్లారు. రైతులు తీసుకున్న పంట రుణాలను రద్దు చేసి ఉచిత విద్యుత్ అందించి మహానేత రైతు బాంధవుడయ్యాడు. ఆయన తనయుడు మరో అడుగు ముందుకేసి రైతన్నల ముంగిటనే రైతు భరోసా కేంద్రాలను నెలకొల్పి ఏ అవసరం వచ్చినా గ్రామం దాటి బయటకు వెళ్లకుండా అన్నీ అక్కడే సమకూర్చారు.

ఉచిత విద్యుత్‌తో వెలుగులు...

వైఎస్సార్ అధికారం చేపట్టగానే రైతులకు ఉచిత విద్యుత్ ఫైల్ పైనే తొలి సంతకం చేశారు. 2004 మే నెలకు ముందు జిల్లాలో 63,559 మంది రైతుల కరెంట్ బకాయిలు రూ.59.5 కోట్లు రద్దు చేశారు. అప్పటికే ఉన్న 71,321 మంది రైతులకు ఉచిత విద్యుత్ అందించారు. ఐదేళ్లలో మొత్తం 86,207 మంది రైతులు ఉచిత విద్యుత్ పొందారు. ఇందుకోసం రూ.65 కోట్ల వరకు ఖర్చు చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత విద్యుత్ పొందే రైతుల సంఖ్య 1.80 లక్షలకు చేరింది.

వైఎస్సార్ ఐదేళ్ల పాలనలో జిల్లాలో ప్రాజెక్టులకు భారీగా నిధుల వరద కురిపించారు. జిల్లాలో 24.37 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేలా చర్యలు చేపట్టారు. గ్యాప్ ఆయకట్టుగా ఉన్న 11.11 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వటానికి ప్రత్యేక ప్రణాళిక ద్వారా చర్యలు తీసుకున్నారు. ఐదేళ్లలో అన్ని ప్రాజెక్టులకు కలిపి రూ.6,280.11 కోట్లు ఖర్చు చేశారు. సాగునీటి ప్రాజెక్టులకు ఇంత మొత్తంలో కేటాయించిన సీఎం వైఎస్సార్ ఒక్కరే. ఆ తరువాత ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటిని కొనసాగిస్తూ ముందుకెళ్తున్నారు.

★ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఒక వరం లాంటిది. జిల్లాలోని 63,346 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రూ.30 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారు. రూ.75 కోట్ల పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు అందించారు. కార్పొరేట్ విద్యా పథకంలో భాగంగా 300 మంది విద్యార్థులకు కార్పొరేట్ తరహా విద్య అందించేందుకు చర్యలు చేపట్టారు.

★ పేదలందరికీ పింఛన్లు అందించారు. 2004 ముందు 2.86 లక్షల మందికి పింఛన్లు ఉన్నాయి. ఇందిరమ్మ మూడు దశల కార్యక్రమాల కింద అదనంగా 1.79 లక్షల మందికి నూతనంగా పింఛన్లు మంజూరు చేశారు. ఏటా అదనంగా రూ.69 కోట్లు పింఛన్ల రూపంలో చెల్లించారు. పావలా వడ్డీ కింద రూ.20 కోట్లు పొదుపు గ్రూపులకు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారు. బ్యాంకు లింకేజీ రుణాలు రూ.853 కోట్లు మంజూరు చేయించారు.

★ వైద్యో నారాయణో హరి అన్న నానుడిని నిజం చేస్తూ 7.19 లక్షల మందికి హెల్త్ కార్డులు అందించారు. 10,366 మందికి గుండె ఆపరేషన్లు చేయించారు. ఆరోగ్య శ్రీ ప్రారంభం సందర్భంగా జిల్లాలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించి 70 వేల మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేయించారు. జిల్లా కేంద్రం ఒంగోలులో రిమ్స్ మెడికల్ కాలేజీని మంజూరు చేయించారు. 37.46 ఎకరాల్లో దాదాపు రూ.250 కోట్లు వెచ్చించి మెడికల్ కళాశాల, 1,000 పడకల రిమ్స్ వైద్యశాలల నిర్మాణాలను చేపట్టారు.

★ గూడులేని వారికి పక్కా ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఐదేళ్లలో 3,22,630 గృహాలు నిర్మించి పేదలకు అందించారు. నివేశన స్థలాలకు రూ.కోట్లు వెచ్చించారు. 19,904 మంది భూమి లేని నిరుపేదలకు 31,734 ఎకరాలు ఏడు విడతల్లో పంపిణీ చేశారు.

★ జిల్లాలో రూ.400 కోట్లతో సాగర్ కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టడంతో జిల్లాలోని 4.50 లక్షల సాగర్ ఆయకట్టుకు సస్యశ్యామలం అయింది. దీంతో యర్రగొండపాలెం, దర్శి, అద్దంకి, పర్చూరు. సంతనూతలపాడు, మార్కాపురం, ఒంగోలు నియోజకవర్గాల రైతులకు ఎంతో మేలు జరిగింది. సమృద్ధిగా నీరు వస్తుండడంతో ఇప్పటికీ పంటలు పండించుకుంటున్నారు.

★ దర్శి నియోజకవర్గంలో రూ.120 కోట్లతో రక్షిత మంచినీటి పథకం నిర్మాణం. రూ.2 కోట్లతో మార్కెట్ యార్డు నిర్మించారు.

★ కనిగిరి నియోజకవర్గంలో రూ.175 కోట్లతో రక్షిత మంచినీటి పథకం మంజూరు చేశారు. ఫ్లోరైడ్‌ను నివారించేందుకు చర్యలు చేపట్టారు.

★ కందుకూరు పట్టణ ప్రజలకు రూ.110 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించారు. రూ.80 కోట్లతో రాళ్లపాడు ప్రాజెక్టు అనుసంధానం కోసం సోమశిల ప్రాజెక్టు నుంచి ఉత్తర కాలువ నిర్మించారు.

★ గిద్దలూరులో రూ.12 కోట్లతో బైరేనిగుండాల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. రూ.22 కోట్లతో రామన్న కతువ ప్రాజెక్టు నిర్మించారు.

★ చీరాల, పర్చూరుల్లో కృష్ణా డెల్టా ఆధునికీకరణకు రూ.2 వేల కోట్లు కేటాయించారు. చేనేతలకు 50 సంవత్సరాలకే పింఛన్ అందజేశారు.

★ అద్దంకిలో రూ.400 కోట్లతో నార్కట్‌పల్లి, అద్దంకి, మేదరమెట్లకు రాష్ట్రీయ రహదారి నిర్మించారు. 5 వేల ఎకరాలకు సాగునీరందించే యర్రం చినపోలి రెడ్డి ఎత్తిపోతల పథకం మంజూరు చేశారు.

గుండ్లకమ్మ ద్వారా ఎంతో ప్రయోజనం

జలయజ్ఞంలో భాగంగా మహానేత డాక్టర్ వైఎస్ఆర్ గుండ్లకమ్మ ప్రాజెక్టును నిర్మించారు. దీంతో సంతనూతలపాడు, ఒంగోలు, పర్చూరు నియోజకవర్గాల ప్రజలకు అటు సాగు ఇటు తాగునీటి అవసరాల తీర్చేందుకు ఎంతగానో దోహదపడుతోంది. ప్రతి సంవత్సరం రెండు సీజన్లలో కలుపుకొని 85 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు వైఎస్ఆర్ హయాంలో వేగవంతంగా పనులు చేపట్టారు. రూ.8,600 కోట్లు కేటాయించారు. ఆ తరువాత టీడీపీ హయాంలో చంద్రబాబు వెలిగొండను పట్టించుకోలేదు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు అదే తరహాలో రైతులను నిలువునా మోసం చేశాడు. ఆ తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన మహానేత తనయుడు వైఎస్ జగన్ రివర్స్ టెండర్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఆదాయాన్ని సమకూర్చటంతో పాటు కాంట్రాక్టర్లను మార్చి ఒకటో టన్నెల్‌ను వడివడిగా పూర్తి చేయించారు. పునరావాస పనులు కూడా వేగవంతంగా సాగుతున్నాయి. ఇక రెండో టన్నెల్ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. అదేవిధంగా ప్రాజెక్టును ప్రారంభించిన తరువాతనే 2024 ఎన్నికలకు వెళతామని సీఎం వైఎస్ జగన్ ప్రజలకు హామీ కూడా ఇచ్చారు.



పూర్తయిన వెలిగొండ ప్రాజెక్టు మొదటి టన్నెల్



గుండ్లకమ్మ ప్రాజెక్టు

కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వ అండ

- రైతుభరోసాతో జిల్లాలో 5,802 మంది కౌలు రైతులకు మేలు
- 47 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా
- ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు



కౌలు రైతులకు రైతు భరోసా చెక్కు అందజేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్, మేయర్

ఒంగోలు అర్బన్: సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలు రైతులతో పాటు అటవీ, దేవదాయ భూములను సాగు చేసుకునే కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటోందని వారికి రైతు భరోసా ద్వారా ఆర్థిక సహాయం అందించడం రైతాంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోందని ఇన్‌చార్జ్ కలెక్టర్ కే శ్రీనివాసులు అన్నారు. వైఎస్ఆర్ రైతు భరోసా పథకంలో భాగంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడత నగదును జమ చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి అన్నీ జిల్లాల కలెక్టర్లతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వీడియో సమావేశం నిర్వహించారు. దానికి అనుబంధంగా ప్రకాశం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కలెక్టర్‌తో పాటు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత, వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొని లబ్ధిదారులైన రైతులకు బ్యాంకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 5,802 మంది కౌలు రైతుల ఖాతాల్లో రూ.4.35 కోట్లు నగదు జమ చేశారన్నారు. 2023 మే నుంచి ఆగస్టు వరకు సంభవించిన అకాల వర్షాలు, వరదలతో పంట నష్టపోయిన 47 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సహాయాన్ని ఉపయోగించుకుని రైతులు మరింత ఉత్సాహంతో పంటలు వేయాలన్నారు.

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు అదే సీజన్‌లో నష్ట పరిహారం ఇచ్చిన ఘనత వైఎస్ జగన్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రైతులకు ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం అందించనంత ఆర్థిక సహాయాన్ని సీఎం వైఎస్ జగన్ అందించారని కొనియాడారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో రైతుల సంక్షేమం కోసం అన్నీ రకాలుగా ఆర్థిక సహాయాన్ని అందించిందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కౌలు రైతులకు సైతం రైతు భరోసా అందించడం గొప్ప విషయమన్నారు. దీనిలో ఉద్యానవన అధికారి గోపిచంద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫోర్డ్‌స్కోప్ పరికరం తయారీపై అవగాహన

ఒంగోలు: ఫోర్డ్ స్కోప్ పరికరం తయారీపై స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో నిర్వహించిన వర్క్‌షాప్‌కు కళాశాల విద్యా కమిషనర్ కార్యాలయం ఏజీవో డాక్టర్ సీహెచ్ తులసీ మస్తానమ్మ హాజరయ్యారు. జంతు వృక్ష రసాయన శాస్త్ర ఆధ్వర్యంలో ఫోర్డ్ స్కోప్ జాతీయ వర్క్‌షాప్‌కు హాజరైన ఆమె ఫోర్డ్ స్కోప్ పరికరం తయారీ, దాని ఉపయోగాలు గురించి వివరించారు. ఈ పరికరం ద్వారా సూక్ష్మాతి సూక్ష్మమైన జీవులను పరిశీలించే విధానాన్ని వివరించారు. కాలువ నీళ్లు, పులిసిన పెరుగు, పాడైన ఉల్లిపాయ, టమోటా మొదలైన వాటిలో సూక్ష్మ ప్రపంచ జీవులను ఈ పరికరం ద్వారా సాధారణ కంటితో చూసే విధానాన్ని డెమో ద్వారా వివరించారు. పాఠ్యాంశ బోధన పూర్తయిన తరువాత అందులోని అంశాలను ఈ పరికరాన్ని ఉపయోగించి సూక్ష్మ ప్రపంచ జీవుల కదలికలను గమనించవచ్చన్నారు. ఈ పరికరాన్ని చౌకగా తయారుచేసే విధానం, సులభంగా వెంట తీసుకువెళ్లే సౌకర్యం గురించి అవగాహన కల్పించారు. ఈ పరికరం ద్వారా సూక్ష్మ ప్రపంచ జీవులను వీడియోలో చిత్రీకరించి భద్రపరుచుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి, కోఆర్డినేటర్లు బి.శ్రీలక్ష్మి, డి.అనంతలక్ష్మి, డాక్టర్ మున్నంగి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

9న జాతీయ మెగా లోక్ అదాలత్

ఒంగోలు: జాతీయ మెగా లోక్ అదాలత్ ఈనెల 9న దేశవ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు తెలిపారు. స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో ఈ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. రాజీపడదగిన క్రిమినల్ కేసులను గుర్తించి కక్షిదారులకు నోటీసులు పంపినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇరువర్గాల ఆమోదంతో సమస్య పరిష్కరించుకోవాలన్నారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు పరిష్కరించుకున్న వారు కోర్టుకు చెల్లించిన ఫీజు కూడా తిరిగి పొందే సదుపాయం ఉంటుందన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రాజీపడేందుకు అర్హత కలిగిన క్రిమినల్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, ప్రీలిటిగేషన్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, ఇరువర్గాల ఆమోదంతో పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు తెలిపారు.

దొరకని చిన్నారి ఆచూకీ

- బాలుడు సాత్విక్ షాలోన్ ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం
- రెండో రోజూ గాలింపుల్లో పాల్గొన్న డాగ్‌స్క్వాడ్ క్లూస్‌టీం
- కాల్‌డేటాపైనే ఆశలు
- కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని చింతలపాలెం ఎస్సీకాలనీలో బుధవారం అర్ధరాత్రి అపహరణకు గురైన మైలారి సామ్యేలు, కెజియా దంపతుల కుమారుడు 16 నెలల సాత్విక్‌షాలోన్ ఆచూకీ కోసం పోలీసులు శుక్రవారం కూడా ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. సాత్విక్ షాలోన్ తల్లి కెజియా, నానమ్మ తిరుపాలమ్మలు బుధవారం రాత్రి ఎప్పటిలాగా ఇంటిముందు వరండాలో పక్కపక్కనే మంచాలు వేసుకుని పడుకోగా సాత్విక్‌షాలోన్ తన నానమ్మ వద్ద పడుకుని ఉండగా అర్ధరాత్రి 2 గంటల సమయంలో వారు మెళకువ వచ్చి చూసేసరికి బాలుడు కనిపించకుండాపోయిన ఘటన విదితమే. దీనిపై బాలుని తల్లి కెజియా ఇచ్చిన సమాచారం మేరకు సీఐ కే.శ్రీనివాసరావు ఆదేశాలతో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై పి.అనిల్‌కుమార్ బుధవారం రాత్రే పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనపై స్పందించిన ఎస్పీ మలికాగర్గ్ వెంటనే బాలుడి కిడ్నాప్ ఘటనపై క్రైమ్స్ అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు, కనిగిరి డీఎస్పీ ఆర్.రామరాజులను క్షేత్రస్థాయిలో పరిశీలించి కేసును నిగ్గుతేల్చాలని ఆదేశించారు. దీనిపై అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు, కనిగిరి డీఎస్పీ రామరాజులు స్థానిక సీఐ కే.శ్రీనివాసరావు, సిబ్బందిని అప్రమత్తంచేసి గురువారం చింతలపాలెం గ్రామం, ఎస్సీ కాలనీ, పొలాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అదేవిధంగా గాలింపు చర్యలో డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం కూడా పాల్గొనగా ఎలాంటి ఆధారాలు లభించలేదని, ఘటనపై 4 బృందాలను ఎస్పీ ఆదేశాలతో ఏర్పాటు చేసి తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని డీఎస్పీ గురువారం రాత్రి తెలిపారు. శుక్రవారం క్రైమ్స్ అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు, కనిగిరి డీఎస్పీ ఆర్.రామరాజు, సీఐలు, ఎస్సైలు మరోమారు చింతలపాలెం గ్రామంలోని సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. బాలుడి తల్లిదండ్రులు, నానమ్మ, స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించగా రాత్రి వరకు కూడా బాలుడి ఆచూకీపై ఎలాంటి సమాచారం దొరకలేదు. అదేవిధంగా డాగ్‌స్క్వాడ్ బృందం, క్లూస్‌టీం సభ్యులు సైతం మరోమారు ఆధారాలు సేకరింపుపై దృష్టి సారించారు.



ఘటనపై డీఎస్పీ, సీఐలతో చర్చిస్తున్న క్రైమ్స్ అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు

కాల్‌డేటాపైనే ఆశలు

శుక్రవారం రాత్రి వరకు బాలుడి ఆచూకీకి సంబంధించి ఎలాంటి సమాచారం తెలియకపోగా పోలీసులు కాల్‌డేటాపై పూర్తిస్థాయిలో దృష్టిసారించారు. ఎవరెవరు ఆ సమయంలో మాట్లాడారు. ఇతరులు ఎవరైనా వచ్చారా, సంచార జాతులు, బయట వ్యక్తుల ప్రమేయం ఏమైనా ఉందా తదితర అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. కాల్‌డేటా శనివారానికి వస్తే కేసు కొలిక్కివచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.





రోదిస్తున్న, తండ్రి సామ్యేలు, తల్లి కెజియ

కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు

మైలాలి సామ్యేలు, కెజియలకు మూడేళ్ల క్రితం వివాహమైంది. తమ 16 నెలల కుమారుడు ఇలా అగుపించకుండా పోవడంతో వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కెజియ ప్రస్తుతం 5 నెలల గర్భిణికాగా తన కుమారుడు అపహరణకు గురవడంతో దిక్కుతోచని స్థితిలో ఉంది. అదేవిధంగా గ్రామంలో సైతం బాలుడి కిడ్నాప్ భయభ్రాంతులను పుట్టిస్తోంది. గాలింపు చర్యల్లో పామూరు, కనిగిరి, పొదిలి, త్రిపురాంతకం, కొండపి సీఐలు, కే.శ్రీనివాసరావు, శివరామకృష్ణారెడ్డి, రాఘవేంద్రరావు, పాపారావు, పాండురంగారావు, ఎస్సైలు సీఎస్‌పురం, పామూరు, వెలిగండ్ల, గిద్దలూరు పి.అనిల్‌కుమార్, కే.సురేష్, పి.మహేష్‌కుమార్, మహేష్, సిబ్బంది నిమగ్నమయ్యారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పర్యావరణ పరిరక్షణ సంస్థ చైర్మన్ జీ వీరభద్రాచారి ఆధ్వర్యంలో మట్టి గణపతే మహాగణపతి అనే పేరుతో ప్రజలకు అవగాహన కల్పించేలా రూపొందించిన గోడపత్రికను ఇన్‌చార్జ్ కలెక్టర్ ప్రకాశం భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏదైనా సాధించవచ్చన్నారు. వినాయక చవితికి మట్టి విగ్రహాలను వినియోగించడం ఎంతో శ్రేష్ఠమని అన్నారు. ప్రజలు పర్యావరణంపై అవగాహనతో మట్టి విగ్రహాలను వినియోగించాలన్నారు. దీనిలో సంస్థ ప్రతినిధులు పైనం మధు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన గుంటూరు జిల్లా ఎడ్లు

బేస్తవారిపేట: మండలంలోని గలిజేరుగుళ్లలో రాధాకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ, అభయాంజనేయస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయిలో పాలపండ్ల సైజ్ ఎడ్ల బండ పందెం పోటీలు హోరా హోరీగా జరిగాయి. పోటీల్లో 21 జతల ఎడ్లు పాల్గొన్నాయి. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెద్దపరిమికి చెందిన మోదుగుల రామిరెడ్డి ఎడ్లు 2766 అడుగులతో మొదటి స్థానంలో నిలిచాయి. విజయవాడకు చెందిన వల్లభనేని మోహన్‌రావు ఎడ్లు 2700 అడుగులతో ద్వితీయ, అనంతపురానికి చెందిన బీ భవానీ ఎడ్లు 2509 అడుగులతో తృతీయ, వైఎస్సార్ జిల్లా దాసరిపల్లె బీ చంద్రకాంత్, ఆంజనేయులు ఎడ్లు 2492 అడుగులతో నాల్గోవ, ప్రకాశం జిల్లా సీఎస్‌పురం కే వెంకటాద్రి ఎడ్లు 2400 అడుగులతో ఐదోవ, వైఎస్సార్ జిల్లా కాశినాయన మండలం నల్లగుండుపల్లె వల్లూరి రవీంద్రారెడ్డి ఎడ్లు 2154 అడుగుల దూరం లాగి ఆరో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి, రెండో, మూడో, నాల్గోవ, ఐదోవ, ఆరో బహుమతులుగా వరసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలను దాతలు అందజేశారు.

క్లుప్తంగా

టమోటా లారీ బోల్తా

● రూ.లక్ష విలువ చేసే టమోటాలు నేలపాలు

ముండ్లమూరు: టమోటా లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన మండలంలోని పోలవరం మలుపు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. కడప నుంచి మార్టూరు వెళ్తున్న టమోటా లారీ దర్శి - అద్దంకి ప్రధాన రహదారిపై బోల్తాపడటంతో రూ.లక్ష విలువచేసే టమోటాలు నేలపాలయ్యాయి. ఆ మార్గంలో వెళ్తున్న వాహనదారులు, స్థానికులు టమోటాల కోసం ఎగబడి అందిన కాడికి తీసుకెళ్లారు. లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

రికార్డు స్థాయిలో నవోదయ దరఖాస్తులు

తర్లుపాడు: ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే నవోదయ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో రికార్డు స్థాయిలో 7,116 దరఖాస్తులు నమోదు చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈసారి దరఖాస్తులు భారీగా పెరిగాయని చెప్పారు. నాణ్యమైన ఆధునిక విద్య అందచడం, విలువలు, పర్యావరణంపై అవగాహన, సంస్కృతిని పెంపొందించడంతో పాటుగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకునే విధంగా నవోదయ తీర్చిదిద్దుతోందని పేర్కొన్నారు. గత ఏడాది ఫలితాల్లో నవోదయ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచిన నేపథ్యంలో దరఖాస్తులు భారీగా వచ్చాయని అభిప్రాయపడ్డారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన కలెక్టర్ దినేష్‌కుమార్, డీఈఓ, ఎంఈఓ, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

కళ్యాణమస్తు

● పేదింటి ఆడపిల్లలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
● వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫాతో పేద కుటుంబాల్లో వెలుగులు
● జిల్లాలో 951 మందికి లబ్ధి



బేస్తవారిపేట: పేదింటి ఆడపిల్లల పెళ్లికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. పేదల పిల్లల వివాహాన్ని గౌరవప్రదంగా నిర్వహించేందుకు సీఎం బాసటగా నిలిచారు. బాల్య వివాహాలను నివారించి, పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ, పేద కుటుంబాలకు చెందిన వధువులకు ప్రభుత్వం అండగా నిలిచింది. గత టీడీపీ పాలనలో ఎన్నికల సమయంలో మాట ఇచ్చి పథకాన్ని అమలు చేయకుండా మోసం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకంతో ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా, పదో తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి నిబంధనలతో పిల్లల చదువులను ప్రోత్సహించేందుకు తోడ్పడుతోంది.

జిల్లాలోని 43 మండలాల్లో ఇప్పటి వరకు 951 మంది వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫాకు దరఖాస్తు చేసుకున్నారు. డీఆర్‌డీఏ, ఎంపీడీఓ లాగిన్‌లో 58 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే చాలా వరకు దరఖాస్తుదారులకు నగదు జమ చేశారు. ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష, కులాంతర వివాహం చేసుకున్న ఎస్సీ, ఎస్టీలకు రూ.1.20 లక్షలు, బీసీలకు రూ.50 వేలు, కులాంతర వివాహం చేసుకున్న బీసీలకు రూ.75 వేలు, విభిన్న ప్రతిభావంతులకు రూ.1.50 లక్షలు, భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు రూ.40 వేలను ప్రభుత్వం మంజూరు చేస్తోంది.

సీఎం మేలు మరువలేం



బేస్తవారిపేటలోని రాణిపేటలో పోలెపోగు జాన్సన్, లక్ష్మీ దంపతుల కుమార్తె హెప్సిబా వివాహం జరగడంతో ప్రభుత్వం వైఎస్సార్ కళ్యాణమస్తు కింద రూ.లక్ష మంజూరు చేసింది. జాన్సన్ కార్పెంటర్ వృత్తి చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఆడపిల్లల పెళ్లి అంటే తల్లిదండ్రులకు ఎంతో ఆర్థిక భారంతో కూడిన విషయం. ఇలాంటి ఎంతో మంది తల్లిదండ్రుల ఆర్థిక భారం తగ్గించేందుకు వైఎస్సార్ కళ్యాణమస్తు ఉపయోగపడుతోంది. వలంటీర్ సహాయంతో సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే హెప్సిబా తల్లి బ్యాంక్ అకౌంట్‌లో రూ.లక్ష జమయ్యాయి. ఈ ఆర్థిక లబ్ధితో ఉపాధికి మార్గం దొరికింది. సీఎం మేలును ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేమని ఆమె కృతజ్ఞతా భావంతో చెప్పింది.

చాలా మంచి పథకం



వెంకట రమణ, శ్రీదేవి దంపతులతో కుమార్తె, అల్లుడు

బేస్తవారిపేట మండలంలోని సోమవారిపేటకు చెందిన బాలాబత్తుని వెంకట రమణ, శ్రీదేవి దంపతుల కుమార్తె రేణుకా ఈశ్వరి వివాహం జరగడంతో ప్రభుత్వం రూ.50 వేలు అందజేసింది. వెంకట రమణ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. కుమార్తె పెళ్లి సందర్భంగా వలంటీర్ అవగాహన కల్పించడంతో వెంటనే దరఖాస్తు చేసుకున్నారు. ఆడ పిల్లలకు పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు ఎన్నో బాధలు పడాల్సి వస్తోందని, అలాంటి వారిని కళ్యాణమస్తు ఆదుకుంటోందని వెంకట రమణ సంతోషం వ్యక్తం చేశారు.

భర్తకు అశ్లీల చిత్రాలు పంపి..

డబ్బు కోసం బ్లాక్‌మెయిల్

● పిల్లలతో సహా వివాహిత ఆత్మహత్యాయత్నం
● కీచకుడి వేధింపులపై ఫిర్యాదు ● పోలీసుల అదుపులో నిందితుడు

కనిగిరి రూరల్: ఓ వివాహితతో మూడేళ్లుగా స్నేహంగా ఉంటూ వచ్చాడు.. ఇద్దరూ సన్నిహితంగా ఉన్న సమయంలో ఫొటోలు తీసుకున్నాడు. ఆమె నుంచి దాదాపు రూ.9 లక్షల వరకు నగదు గుంజాడు. మరో రూ.లక్ష నగదు కావాలని డిమాండ్ చేశాడు. తన దగ్గర లేవని చెప్పడంతో.. ఆమె భర్తకే అశ్లీల ఫొటోలు పంపిస్తానని బ్లాక్ మెయిల్ చేశాడా ప్రబుద్ధుడు. ఈ 'కీచక పర్వం' శుక్రవారం కనిగిరి పట్టణంలో వెలుగు చూసింది. అందిన సమాచారం మేరకు.. తుమ్మగుంటకు చెందిన బేల్దారి మేస్త్రీ వి.శ్రీను పట్టణంలో చిరువ్యాపారం చేసుకునే మహిళతో చనువుగా ఉంటున్నాడు. గడిచిన మూడేళ్లలో ఆమె నుంచి పలు దఫాలుగా రూ.9 లక్షల వరకు నగదు తీసుకున్నాడు. నెల రోజుల క్రితం ఇంకో రూ.లక్ష నగదు ఇవ్వాలని ఆమెను కోరగా తన వద్ద లేవని చెప్పింది. నగదు ఇవ్వకపోతే ఇద్దరూ కలిసి ఉన్న ఫొటోలు ఐఎంఓ యాప్‌లో పెడతానని, స్నేహితులకు పంపుతానని శ్రీను బెదిరించసాగాడు. దీంతో ఆమె దుకాణంలో వచ్చిన డబ్బు, చీటీల ద్వారా వచ్చిన డబ్బు కూడా భర్తకు తెలియకుండా ఇచ్చానని, ఫొటోలు బయటపెట్టవద్దని ప్రాధేయ పడింది. అయినా శ్రీను వినకుండా ఆమెను తీవ్రంగా వేధించసాగాడు. ఈ క్రమంలోనే శ్రీను తన వద్ద ఉన్న ఫొటోలను మహిళ భర్తకు పంపినట్లు తెలిసింది. ఈ పరిణామంతో తీవ్రఅవమానానికి గురైన ఆ మహిళ గురువారం రాత్రి తన పిల్లలతో సహా ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి కాపాడినట్లు సమాచారం. అయితే ఆ మహిళ భర్తతో శ్రీను స్నేహితులు కూడా శుక్రవారం అసభ్యకరంగా మాట్లాడినట్లు సమాచారం. దీంతో తీవ్ర మానసిక వేదనకు గురైన భార్యాభర్తలిద్దరూ కనిగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా బేల్దారీ మేస్త్రీ శ్రీను గతంలో కూడా తన స్వగ్రామంలో ఓ మహిళను మోసం చేసి చివరకు రాజీ కుదుర్చుకున్నట్లు తెలిసింది.

బాలికపై వృద్ధుడు అత్యాచారయత్నం

మద్దిపాడు: బాలికపై వృద్ధుడు అత్యాచారానికి యత్నించిన సంఘటన మండలంలోని దొడ్డవరం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన 12 సంవత్సరాల బాలికపై అదే గ్రామానికి చెందిన 70 ఏళ్ల వయసున్న కుంచాల గురవయ్య గురువారం సాయంత్రం అత్యాచారానికి యత్నించాడు. బాలిక తన ఇంటి బాత్‌రూమ్‌లో గిన్నెలు కడుగుతుండగా వృద్ధుడు లోనికి ప్రవేశించి నోటిలో గుడ్డలు కుక్కి, అత్యాచారానికి యత్నించాడు. బాలిక తల్లి అలికిడి విని పెద్దగా కేకలు వేయడంతో గురవయ్య పారిపోయాడు. దీనిపై బాలిక తల్లిదండ్రులు మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో ఫిర్యాదు చేశారు. మద్దిపాడు ఎస్సై శ్రీకాంత్ ఫిర్యాదు స్వీకరించి వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

13 మంది ఉపాధి సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

ముండ్లమూరు: మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు జరిగాయని ఆడిట్ సిబ్బంది నివేదికల ఆధారంగా తేలడంతో 13 మంది సిబ్బందిపై వేటు పడినట్లు ఎంపీడీఓ హనుమంతరావు శుక్రవారం తెలిపారు. ఈ ఏడాది జూలై నెలలో చేపట్టిన ఆడిట్ నివేదికల ఆధారంగా పలు గ్రామాల్లో అక్రమాలు జరిగినట్లు తేల్చారు. ఆ నివేదికల ఆధారంగా జిల్లా అధికారులు కలెక్టర్‌కు నోట్‌ఫైల్ సమర్పించారు. దీంతో జిల్లా కలెక్టర్ 13 సిబ్బందిని సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ చేసిన వారిలో ఏపీఓ చినకొండయ్య, బేర్‌ఫుట్ టెక్నీషియన్ (బీఎఫ్‌టీ) నాగరాజు, ఈసీ ఈశ్వరీదేవి, సాంకేతిక సహాయకులు షాలేముదేవదాస్, ఆర్ సుధాకర్, ఎస్ నాగేశ్వరరావు, జీ రూతమ్మ, జీ మాలకొండారెడ్డి, అశోక్‌కుమార్, క్షేత్ర సహాయకులు ఇమ్మానియేలు, శివపార్వతి, శ్రీనివాసరెడ్డి, నాగలక్ష్మిలను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

బెడిసికొట్టిన జనార్దన్ ప్లాన్

● ముస్లింలను రెచ్చగొట్టి సానుభూతి పొందాలనుకోవడం అవివేకం
● వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ ఒంగోలు నగర కన్వీనర్ మున్నా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఒంగోలు: ప్రశాంతంగా ఉన్న ఒంగోలు ఇస్లాంపేటలో ముస్లింలను రెచ్చగొట్టి తద్వారా సానుభూతి పొందాలనుకున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వ్యూహం బెడిసికొట్టిందని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ ఒంగోలు నగర కన్వీనర్ షేక్ మున్నా అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇస్లాంపేట అనేది వైఎస్సార్ సీపీ అడ్డా అని స్పష్టం చేశారు. అటువంటి ప్రాంతంలో టీడీపీ మీటింగ్‌లు పెట్టడం ద్వారా వివాదం జరిగితే సానుభూతి వస్తుందని జనార్దన్ ప్లాన్ చేశాడన్నారు. బండ్లమిట్టలో ముస్లింల షాపులను జనార్దన్ ధ్వంసం చేయించి.. దానికి వ్యతిరేకంగా వ్యవహరించిన ముస్లిం జాగరణ్ మంచ్ అధ్యక్షుడు మొహమ్మద్ బుజ్జిపై కేసులు బనాయించడమే కాకుండా అరికాళ్ల కోటింగ్ ఇప్పించాడని గుర్తు చేశారు. చంద్రబాబు ర్యాలీ ముందుకు సాగిపోయిన తర్వాత జై బాలినేని అని బాషా సోదరుడు ఒకరు అంటే.. అతడిని మూడు రోజులపాటు పోలీసుస్టేషన్‌కు పిలిపించి భయాందోళనకు గురిచేశారన్నారు. నిజంగా ముస్లింలపై జనార్దన్‌కు ప్రేమ ఉంటే కరోనా సమయంలో ఎందుకు పట్టించుకోలేదో సమాధానం చెప్పాలన్నారు. వక్ఫ్ ఆస్తులకు సంబంధించి బాలినేనిపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. టీడీపీ హయాంలో ఏకంగా 94 రిజిస్ట్రేషన్లు జరిగాయని, సమాచార హక్కు చట్టం కింద ఎవరైనా ఈ సమాచారం పొందవచ్చని మున్నా అన్నారు. వక్ఫ్ ఆస్తుల అన్యాక్రాంతానికి టీడీపీ పెట్టింది పేరని, అందుకు సర్వే నంబర్ 253 ఉదాహరణ అని తెలిపారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, నగర నాయకులు కటారి శంకర్, బొమ్మినేని మురళి, పసుపులేటి ఏడుకొండలు, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు





వైద్యశాలలో చికిత్స పొందుతున్న కిరణ్, ముసలయ్య



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కోటయ్య

● ఒకరు మృతి, మరో ఇద్దరికి తీవ్రగాయాలు



మృతిచెందిన కొండలు

యర్రగొండపాలెం: మండలంలోని బోయలపల్లె సమీపంలోని ఐటీఐ కళాశాల వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలో వలంటీరుగా పనిచేస్తున్న ఐనోలు కొండలు (32) బైక్‌పై యర్రగొండపాలెం వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలు దేరాడు. 9వ తరగతి చదువుతున్న అదే గ్రామానికి చెందిన కె.ముసలయ్య, కె.కిరణ్ అనే విద్యార్థులు విజయ్ దేవరకొండ హీరోగా నటించిన ఖుషి సినిమా రిలీజ్ కావడంతో ఆ సినిమా చూసి తిరిగి గ్రామానికి చేరేందుకు కొండలు మోటారు బైక్‌పై ఎక్కారు. వీరు కొన్ని నిమిషాల్లో ఇళ్లకు చేరతారనగా మార్కాపురం నుంచి యర్రగొండపాలెం వస్తున్న కారు ఐటీఐ కళాశాల వద్ద మలుపులో ఢీకొట్టింది. ఈ ఘటనలో కొండలు అక్కడికక్కడే మృతి చెందాడు. ముసలయ్య, కిరణ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం పల్నాడు జిల్లా నరసరావుపేట తరలించారు. మృతిచెందిన కొండలుకు భార్య ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు దుర్మరణం

● న్యాయం చేయాలని త్రోవగుంట వద్ద బంధువుల ఆందోళన
● జాతీయ రహదారిపై 2 గంటలు స్తంభించిన ట్రాఫిక్



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భవానిశంకర్



జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న మృతుడి బంధువులు

ఒంగోలు సిటీ: బైక్‌పై వెళ్తున్న యువకుడిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఒంగోలు నగర శివారులోని మండువవారిపాలెం సచివాలయం సమీపంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు.. మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లి అంజయ్య నగర్‌కు చెందిన భవానీ శంకర్ మోటారు సైకిల్ మీద ఒంగోలు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో అదే మార్గంలో వస్తున్న ట్రాక్టర్ ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నుంచి ఎగిరిపడిన భవానీశంకర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భవాని శంకర్ బంధువులు న్యాయం చేయాలంటూ త్రోవగుంట వద్ద జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. సుమారు రెండు గంటలపాటు ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. మృతుడి బంధువులకు ఒంగోలు తాలుకా పోలీసులు సర్ది చెప్పి ఆందోళన విరమింపజేశారు. ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేయడంతోపాటు డ్రైవరును అదుపులోనికి తీసుకున్నారు.

బాణాలతో సోదరుల పరస్పర దాడులు



వీపులో బాణం దిగి గాయపడిన అంకన్న



చికిత్స పొందుతున్న పెద్ద వీరన్న

● ఇద్దరికీ తీవ్రగాయాలు

పెద్దదోర్నాల: కుటుంబ తగాదాల నేపథ్యంలో ఇద్దరు సోదరులు పరస్పరం బాణాలతో దాడులు చేసుకున్న సంఘటన పెద్దదోర్నాల మండల పరిధిలోని చిన్నారుట్లలో నల్లమల అటవీ ప్రాంతంలో గురువారం రాత్రి చోటుచేసుకోగా శుక్రవారం వెలుగుచూసింది. స్థానిక ఎస్సై అంకమరావు కథనం మేరకు.. చిన్నారుట్లకు చెందిన సోదరులు దాసరి పెద్ద వీరన్న, అంకన్న నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్టులో నివాసం ఉంటున్నారు. ఓ కుటుంబ పంచాయతీ విషయంలో చిన్నారుట్లకు చేరుకున్న వీరి మధ్య వివాదం చెలరేగింది. దీంతో పరస్పరం బాణాలు వేసుకుని దాడులకు తెగబడ్డారు. ఈ దాడుల్లో అంకన్న వీపులో ఓ బాణం దిగబడగా, దాసరి పెద్ద వీరన్న తొడలో మరో బాణం దిగబడింది. వైద్యం కోసం అంకన్నను ఒంగోలు తరలించారు. శస్త్ర చికిత్స అనంతరం వీపులో దిగబడిన బాణాన్ని తొలగించారు. స్వల్పంగా గాయపడిన దాసరి పెద్ద వీరన్నను చిన్నారుట్ల సమీపంలోని శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలో గల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై అంకమరావు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి

● ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి



మాట్లాడుతున్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

ఒంగోలు: విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కేంద్రీయ విద్యాలయంలో ఎంపీ నిధులతో అందించిన 30 కంప్యూటర్లతో కూడిన ల్యాబ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఎంపీ మాట్లాడుతూ ఒంగోలు కేంద్రీయ విద్యాలయం తన దత్తపుత్రికగా పేర్కొన్నారు. విద్యాలయంలో క్రీడా ప్రాంగణం మెరక చేయాల్సిన అవసరాన్ని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలలో సౌకర్యాల కల్పనకు తాను ఎప్పుడూ ముందుంటానని తెలిపారు. వై.పాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో మంచినీటి సౌకర్యం కోసం ఎంపీ నిధుల నుంచి రూ.12 లక్షలు విడుదల చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ సూర్యప్రకాశరావు మాట్లాడుతూ తమ కేంద్రీయ విద్యాలయ అభివృద్ధి కోసం ఎంపీ చేస్తున్న కృషి అమూల్యమైనదని పేర్కొంటూ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మీడియాతో మాట్లాడుతూ దేశంలో విద్యాభివృద్ధి కోసం ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. రూ.11 లక్షలతో 30 కంప్యూటర్లను అందించి కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బెల్లం సత్యన్నారాయణ, తాతా ప్రసాద్, కుప్పా రంగసాయి, ఆత్మకూరు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ టీచర్‌గా మౌలాలి



ఉపాధ్యాయుడు షేక్ మౌలాలి

తర్లుపాడు: మండలంలోని లింగారెడ్డి కాలనీ ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ మౌలాలి 2023 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. 1996లో మండలంలోని కేతగుడిపి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. గతంలో మండలంలోని సూరేపల్లి, కందివారిపల్లి, పెద్దారవీడు మండలంలోని తంగిరాలపల్లి పాఠశాలల్లో పనిచేశారు. పిల్లలతో పాటు వారి తల్లిదండ్రుల్లో విద్యపై చైతన్యం కల్పించడం, బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించడంతోపాటు హాజరు నూరు శాతం ఉండేందుకు కృషి చేస్తున్నారు. ప్రాథమిక స్థాయిలోనే పిల్లలతో ప్రాజెక్టు వర్కులు చేయించడం, సైన్స్ మేళాలు నిర్వహించడం, నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు అక్షర విజయం లాంటి కార్యక్రమాల ద్వారా అక్షరాస్యతను పెంపొందించేందుకు కృషి చేశారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు చదువుతోపాటు వారికి ఆసక్తి ఉన్న అంశాల్లో ప్రోత్సాహం అందించారు. పనిచేసిన ప్రతి చోటా పాఠశాలలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అవార్డుకు ఎంపికైన మౌలాలిని ఎంపీపీ భూలక్ష్మీ రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వెన్నా ఇందిరా హనుమారెడ్డి, నాయకులు అభినందించారు.

రైల్వే బ్రిడ్జి నిర్మాణం కోసం పరిశీలన



కరవది రైల్వే గేటు వద్ద చర్చిస్తున్న అధికారులు

ఒంగోలు రూరల్: మండలంలోని ఒంగోలు-కరవది రోడ్డు మార్గంలో కరవది వద్ద రైల్వే ట్రాక్‌పై బ్రిడ్జి నిర్మాణం కోసం రైల్వేశాఖ అధికారులు, ఒంగోలు రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు శుక్రవారం పరిశీలించారు. విజయవాడ నుంచి వచ్చిన రైల్వే అధికారి ఎస్.శ్రీనివాస్, ఒంగోలు తహసీల్దార్ పి.మురళి, ఆర్ అండ్‌బీ డీఈ ఎస్.అరుణకుమారి, ఏఈ సీహెచ్ శ్రీకాంత్, కరవది సర్పంచ్ డి.కోటేశ్వరరావు, ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు సంయుక్తంగా పరిశీలించారు. 14 గ్రామాలకు సెంటర్ పాయింట్ అయిన కరవది వ్యాపారంగా, ఆక్వా కల్చర్, సాల్ట్ ప్రొడక్షన్, బ్రిక్స్ ఇండస్ట్రీ పరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రైల్వే బ్రిడ్జి నిర్మిస్తే ఎంతో ఉపయోగం ఉంటుందని స్థానిక సర్పంచ్ డి.కోటేశ్వరరావు, ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు అధికారులకు తెలిపారు. నిత్యం ఒంగోలు నగరానికి రాకపోకలు జరుగుతుంటాయని, ప్రస్తుతం రైల్వే మూడో లైన్ కూడా ఏర్పాటైందని, అందువలన త్వరగా బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టి వేగంగా పూర్తిచేయాలని కోరారు.

సాక్షి బిజినెస్
శనివారం
2-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	556	65,387
నిఫ్టీ ▲	182	19,435

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,010	▽	25
డోజోన్స్	34,782	▲	60
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,465	▲	25
డాక్స్	15,840	▽	107
షాంఘై	3,133	▲	13
నికాయ్	32,713	▲	91

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,489	▲	4
బంగారం (99.5 స్వచ్ఛత)	59,251	▲	4
వెండి (కిలో)	74,838	▽	193

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	81.63	83.50
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.01	106.40
€	యూరో	ఒకటి	88.08	91.20
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.95	57.72
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.41	54.75
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.21	62.17
SAR	సౌదీ రియాల్	ఖాళీచెక్	21.10	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాళీచెక్	21.62	23.42
¥	చైనా యువాన్	ఖాళీచెక్	10.28	12.35

జీఎస్‌టీ వసూళ్లు 11 శాతం అప్

ఆగస్టులో రూ.1,59,069 కోట్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు 2023 ఆగస్టులో గత ఏడాది ఇదే నెలతో పోల్చితే 11 శాతం పెరిగి రూ.1.59 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే..

- మొత్తం వసూళ్లు రూ.1,59,069 కోట్లు.
- సెంట్రల్ జీఎస్‌టీ వాటా రూ.28,328 కోట్లు.
- ఎస్‌జీఎస్‌టీ వసూళ్లు రూ.35,794 కోట్లు.
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.83,251 కోట్లు.
- సెస్ రూ.11,696 కోట్లు.

ఆర్థిక సంవత్సరంలో తీరిది...

ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్లో చరిత్రాత్మక స్థాయిలో రూ.1.87 లక్షల కోట్ల అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. మే, జూన్‌లో వరుసగా రూ.1.57 లక్షల కోట్లు, రూ.1.61 లక్షల కోట్లు ఒనగూరాయి.

గ్రీస్‌లో జీఎంఆర్ మరిన్ని పెట్టుబడులు



ముంబై: గ్రీస్‌లో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్న దేశీ దిగ్గజం జీఎంఆర్ గ్రూప్.. ఆ దేశంలో మరిన్ని పెట్టుబడులు పెట్టే యోచనలో ఉంది. కెలమాటా ఎయిర్‌పోర్ట్‌లో ఇన్వెస్ట్ చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ప్రస్తుతం జీఈకే టెర్నా సంస్థతో కలిసి గ్రీస్‌లోని క్రెట్ ప్రాంతంలో హెరాక్లియోన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు జీఎంఆర్ గ్రూప్ తెలిపింది. హెరాక్లియోన్ విమానాశ్రయ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఇంధన, అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్స్ వ్యాపార విభాగం చైర్మన్ శ్రీనివాస్ బొమ్మిడాల తెలిపారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనలో భాగంగా గ్రీస్ ప్రధాన మంత్రి నిర్వహించిన విందులో శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. భారత్, గ్రీస్ మధ్య కనెక్టివిటీ మెరుగుపడితే ఇరు దేశాల స్థూల దేశీయోత్పత్తి వృద్ధికి, వ్యాపార అవకాశాల కల్పనకు తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు.

93 శాతం 2,000 నోట్లు వెనక్కు వచ్చేశాయ్: ఆర్‌బీఐ



ముంబై: ఉపసంహరణ నిర్ణయం వెలువడిన మే 19వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 93 శాతం తిరిగి వచ్చేశాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రకటన ఒకటి పేర్కొంది. ఆర్‌బీఐ ప్రకటన ప్రకారం, ఆగస్టు 31వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్ల విలువ రూ.0.24 లక్షల కోట్లకు పడిపోయింది. బ్యాంకులకు తిరిగి వచ్చిన నోట్లలో 87 శాతం డిపాజిట్ల రూపంలో జరగ్గా, 13 శాతం బ్యాంకుల్లో ఇతర కరెన్సీలోకి మార్పిడి ద్వారా వెనక్కువచ్చాయి. అధిక విలువ నోట్లు కలిగి ఉన్న ప్రజలు 2023 సెప్టెంబరు 30 నాటికి ఆ నోట్లను డిపాజిట్ చేయాలని లేదా నిబంధనలకు అనుగుణంగా మార్చుకోవాలని ఆర్‌బీఐ సూచించింది. 2016 నవంబర్లో రూ.500, రూ.1,000 నోట్లను రద్దుచేసి కొత్త రూ.500, రూ.2,000 నోట్లను తీసుకువచ్చిన ఆర్‌బీఐ, మే 19వ తేదీన ఒక కీలక ప్రకటన చేస్తూ, రూ.2,000 నోట్లను కూడా సెప్టెంబర్ 30 నాటికి పూర్తిగా వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. నిజానికి 2018–19లోనే ఆర్‌బీఐ రూ. 2,000 నోట్ల ముద్రణను నిలిపివేసింది. 2018 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల గరిష్ట చెలామణీ విలువ రూ.6.73 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం రూ.2,000 నోట్లలో ఈ విలువ 37.3 శాతానికి సమానం. 2023 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల చెలామణీ విలువ రూ.3.62 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం నోట్లలో ఈ విలువ 10.8% మాత్రమే. వ్యవస్థలో 2,000 నోట్ల వినియోగం ఇంధనం, బంగారు ఆభరణాలు, కిరాణా కొనుగోళ్లకు అధికంగా వినియోగిస్తున్నట్లు ఇప్పటికే పలు సర్వేలు వెల్లడించాయి.

ఎయిర్ ఇండియా–విస్తారా విలీనానికి గ్రీన్ సిగ్నల్

కాంపిటీషన్ కమిషన్ ఆమోదముద్ర



న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా–విస్తారా విలీనబాటలో కీలక అడుగు పడింది. కొన్ని షరతులకు లోబడి ఎయిర్ ఇండియా–విస్తారా ప్రతిపాదిత విలీనాన్ని కాంపిటీషన్ కమిషన్ శుక్రవారం ఆమోదించింది. తన విమానయాన వ్యాపారాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి సంబంధించి టాటా గ్రూప్‌కు ఇది ఒక ప్రధాన ముందడుగు. ప్లాట్‌ఫారమ్ 'ఎక్స్' పై చేసిన ఒక పోస్టింగ్‌లో విలీనానికి ఆమోదముద్ర వేసినట్లు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తెలిపింది. ''ఎయిరిండియాలో టాటా ఎస్‌ఐఏ ఎయిర్‌లైన్స్ విలీనానికి సీసీఐ ఆమోదం తెలిపింది. పార్టీలు అందించే స్వచ్ఛంద కట్టుబాట్లకు, విధి విధానాలకు లోబడి ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ నిర్దిష్ట వాటాలను కొనుగోలు చేస్తుంది' అని సీసీఐ పేర్కొంది. విస్తారా, ఎయిర్ ఇండియా టాటా గ్రూప్‌లో భాగంగా ఉన్న రెండు వేర్వేరు విమానయాన సంస్థలు. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు విస్తారాలో 49% వాటా ఉంటే, టాటా సన్స్ వాటా 51%గా ఉంది. ఎయిరిండియాలో 25.1% వాటాను సింగపూర్ ఎయిర్‌లైన్స్ కొనుగోలు చేయనున్న ఒప్పందం ప్రకారం విస్తారాను ఎయిర్ ఇండియాతో విలీనం చేస్తున్నట్లు గతేడాది నవంబర్‌లో టాటా గ్రూప్ ప్రకటించింది.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో వార్‌బర్గ్ పింకస్ వాటా విక్రయం



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అమెరికన్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ వార్‌బర్గ్ పింకస్ 4.2 శాతం వాటాలను ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా విక్రయించింది. వీటి విలువ రూ. 2,480 కోట్లు. బీఎస్‌ఈ డేటా ప్రకారం వార్‌బర్గ్ పింకస్ అనుబంధ సంస్థ క్లోవర్‌డెల్ ఇన్వెస్ట్‌మెంట్ 27.86 కోట్ల షేర్లను (4.2 శాతం) వాటాలను షేరు ఒక్కింటికి రూ. 89 రేటుతో విక్రయించింది. జూన్ ఆఖరు నాటి గణాంకాల ప్రకారం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అనుబంధ సంస్థల ద్వారా వార్‌బర్గ్ పింకస్‌కు 8.5 శాతం వాటాలు ఉన్నాయి.

ఆగస్టులో ఆల్‌టైమ్ 'రయ్'!




న్యూఢిల్లీ: దేశీయ ప్యాసింజర్ వాహన అమ్మకాలు ఆగస్టులో ఆల్‌టైం గరిష్టానికి చేరుకున్నాయి. ఎస్‌యూవీ(స్పోర్ట్ యుటిలిటీ వెహికల్స్)లకు డిమాండ్ కొనసాగడం, పండుగ సీజన్ మొదలవడంతో గిరాకీ పుంజుకుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మారుతీ సుజుకీ రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిపింది. మొత్తం 1,89,082 వాహనాలు విక్రయించింది. గతేడాది ఇదే నెల అమ్మకాలు 1,65,173 యూనిట్లతో పోలిస్తే 14% అధికం. హ్యుందాయ్, ఎంఅండ్ఎం, టయోటా కిర్లోస్కర్ కంపెనీలు అమ్మకాల్లో రెండంకెల వృద్ధిని సాధించాయి. టాటా మోటార్స్, హోండా కార్స్ విక్రయాల్లో స్వల్ప క్షీణత నమోదైంది. ద్విచక్ర వాహన విభాగంలో బజాజ్ ఆటో విక్రయాలు 15% తగ్గాయి. హీరో మోటో కార్ప్, టీవీఎస్ మోటార్స్ అమ్మకాలు వరుసగా 6%, 4% పెరిగాయి. వాణిజ్య వాహనాలు, ట్రాక్టర్ల అమ్మకాలు కూడా గణనీయంగా పెరిగాయి.

ఆగస్ట్ వాహన అమ్మకాల తీరు..

	2023	2022	వృద్ధి(%)
మారుతీ	1,89,082	1,65,173	(+)14
హ్యుందాయ్	71,435	62,210	(+)15
టాటా మోటార్స్	78,010	78,843	(-)1
ఎండ్ అండ్ ఎం	70,350	59,049	(+)19
హోండా కార్స్	7,880	7,769	(+)1
ఎంజీ మోటార్స్	4,185	3,823	(+)9
టయోటా	22,910	14,959	(+)53
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,41,648	4,01,595	(-)15
హీరో మోటో	4,88,717	4,62,608	(+)6
టీవీఎస్	3,45,848	3,33,787	(+)4
రాయల్ ఎన్‌ఫీల్డ్	77,583	70,112	(+)11
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	6,476	5,003	(+)29
అశోక్ లేలాండ్	15,576	14,121	(+)10
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	5,198	5,308	(+)2
మహీంద్రా	21,676	21,520	(+)1

కోవర్టు లాబీయింగ్ చేశాయి

- పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకున్నాయి
- అనిల్ అగర్వాల్ సంస్థలను టార్గెట్ చేసిన ఓసీసీఆర్‌పీ
- వేదాంత, కెయిర్న్‌పై ఆరోపణలు



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ ప్రమోటర్లపై ఆరోపణలు గుప్పించిన ఓసీసీఆర్‌పీ తాజాగా పారిశ్రామిక దిగ్గజం అనిల్ అగర్వాల్‌కి చెందిన కంపెనీలు వేదాంత, కెయిర్న్ ఇండియాను టార్గెట్ చేసింది. పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకునేందుకు వేదాంత కోవర్టు లాబీయింగ్ నడిపినట్లు కొత్తగా మరో నివేదికలో ఆరోపించింది. ప్రభుత్వం కూడా ప్రజలను సంప్రదించకుండా నిబంధనల మార్పులను ఆమోదించి, 'అక్రమ పద్ధతుల్లో' అమలు చేసినట్లు పేర్కొంది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఓసీసీఆర్‌పీ) విడుదల చేసిన నివేదికలోని కొన్ని ప్రధానాంశాలు..

- కొత్తగా పర్యావరణ అనుమతుల అవసరం లేకుండా దేశీయంగా ఉత్పత్తిని 50% వరకు పెంచుకునేందుకు మైనింగ్ కంపెనీలకు అనుమతినిస్తే ఆర్థిక వ్యవస్థ రికవరీ మరింత వేగవంతం కాగలదని 2021 జనవరిలో వేదాంత గ్రూప్ చైర్మన్ అనిల్ అగర్వాల్ అప్పటి పర్యావరణ శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్‌కు లేఖ రాశారు.
- ''2022 తొలినాళ్లలో పలు దఫాల సమావేశాల అనంతరం పర్యావరణ శాఖ నిబంధనలను సడలించింది. ప్రజాభిప్రాయాల సేకరణ నిర్వహించాల్సిన అవసరం లేకుండా మైనింగ్ కంపెనీలు 50 శాతం వరకు ఉత్పత్తిని పెంచుకునేందుకు అనుమతించింది'' అని ఓసీసీఆర్‌పీ తెలిపింది.
- వేదాంత తరహాలోనే దాని అనుబంధ సంస్థ కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ కూడా వ్యవహరించింది. చమురు అన్వేషణ ప్రాజెక్టుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిబంధనను ఎత్తివేసేందుకు లాబీయింగ్ చేసింది.
- అధికార బీజేపీకి వేదాంత గణనీయంగా విరాళాలు కూడా ఇచ్చినట్లు (2016–2020 మధ్య కాలంలో రూ.43.5 కోట్లు) ఆధారాలు ఉన్నాయని ఓసీసీఆర్‌పీ తెలిపింది.

వేదాంత స్పందన ఇదీ..

ఓసీసీఆర్‌పీ ఆరోపణలను నిర్దుష్టంగా ఖండించకుండా వేదాంత స్పందించింది. 'దిగుమతులకు ప్రత్యామ్నాయంగా పర్యావరణానికి అనుకూలమైన విధానాల్లో దేశీయంగా ఉత్పత్తిని పెంచాలనేది మా లక్ష్యం. దానికి అనుగుణంగా దేశాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, సహజ వనరుల విషయంలో భారత్ స్వావలంబన సాధించడంలో తోడ్పాటు అందించే ఉద్దేశంతో ప్రభుత్వ పరిశీలన కోసం పలు విజ్ఞప్తులు చేశాము' అని సంస్థ అధికార ప్రతినిధి తెలిపారు.

రెండు నెలల్లో అతిపెద్ద లాభం

- మెప్పించిన స్థూల ఆర్థిక గణాంకాలు
- సెన్సెక్స్ లాభం 556 పాయింట్లు
- 19,400 స్థాయి పైకి నిఫ్టీ



ముంబై: స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించడంతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసిరావడంతో శుక్రవారం స్టాక్ సూచీలు ఒక శాతం మేర ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ 556 పాయింట్లు పెరిగి 65,387 వద్ద నిలిచింది. నిఫ్టీ 182 పాయింట్లు బలపడి 19,435 వద్ద స్థిరపడింది. వెరసి గడిచిన రెండు నెలల్లో అతిపెద్ద లాభాన్ని గడించాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లూ రాణించాయి. ఒక దశలో సెన్సెక్స్ 642 పాయింట్లు దూసుకెళ్లి 65,473 వద్ద, నిఫ్టీ 205 పాయింట్లు ఎగసి 19,459 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. మెటల్, ఆయిల్‌అండ్‌గ్యాస్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు రాణించి సూచీల ర్యాలీకి ప్రాతినిధ్యం వహించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.488 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,295 కోట్ల ఈక్విటీలు కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 500 పాయింట్లు, నిఫ్టీ 169 పాయింట్లు లాభపడ్డాయి. కాగా, సెన్సెక్స్ భారీ ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.312.33 లక్షల కోట్లు ఎగబాకింది.

సాక్షి స్పోర్ట్స్

అంతర్జాతీయ క్రికెట్ ఆడనున్న తొలి 'ట్రాన్స్‌జెండర్'గా డానిల్ మెక్‌గహే

అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి 'ట్రాన్స్‌జెండర్' బరిలోకి దిగనుంది. లింగ మార్పిడి చేసుకున్న కెనడాకు చెందిన 29 ఏళ్ల డానిల్ మెక్‌గహే ఇప్పుడు మహిళల జట్టు తరఫున క్రికెట్ ఆడుతుంది. అమెరికన్ క్వాలిఫయర్ టోర్నీలో పాల్గొనే కెనడా టి20 జట్టులో ఆమెకు చోటు లభించింది. ఆస్ట్రేలియాలో పుట్టిన ఆమె కెనడాకు వలస వచ్చింది. 2020లో పురుషుడి నుంచి స్త్రీగా మారేందుకు సిద్ధమైన ఆమె 2021లో వైద్యపరంగా పూర్తి స్థాయిలో మహిళగా మారింది. ట్రాన్స్‌జెండర్‌లు అంతర్జాతీయ మ్యాచ్ ఆడేందుకు ఐసీసీ నిర్దేశించిన అర్హత ప్రమాణాలను ఆమె ఇటీవలే అందుకుంది. 'ట్రాన్స్‌జెండర్‌ను మహిళగా గుర్తించాలంటే వరుసగా 12 నెలల పాటు టెస్టోస్టిరాన్ లెవల్ 5 నానోమోల్/లీటర్‌కంటే తక్కువగా ఉండాలి' అనేది ఐసీసీ నిబంధన.



నీరజ్‌కు రెండో స్థానం

జ్యూరిచ్ డైమండ్ లీగ్ మీట్

జ్యూరిచ్ (స్విట్జర్లాండ్): భారత స్టార్ అథ్లెట్, వరల్డ్ చాంపియన్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ మీట్‌లో కాస్త తడబడ్డాడు. ఈ సీజన్ లీగ్ నాలుగో మీట్ బరిలోకి దిగిన నీరజ్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. జ్యూరిచ్‌లో జరిగిన ఈ పోటీల్లో నీరజ్ 85.71 మీటర్ల దూరం జావెలిన్ విసిరాడు. ఈ ఈవెంట్‌లో జాకబ్ వాద్లెచ్ (చెక్ రిపబ్లిక్ – 85.86 మీటర్లు) అగ్రస్థానం సాధించగా... జూలియన్ వెబర్ (జర్మనీ – 85.04 మీటర్లు) మూడో స్థానంలో నిలిచాడు. నీరజ్ విసిరిన ఆరు త్రో లలో 80.79 మీ., 85.22 మీ., 85.71 మీ. దూరాలు నమోదు చేయగా మరో మూడు త్రో లు 'ఫౌల్' అయ్యాయి. అయితే మూడు మీట్‌లలో కలిపి 23 పాయింట్లు సాధించడం ద్వారా మూడో స్థానంతో డైమండ్ లీగ్ ఫైనల్ చాంపియన్‌షిప్‌కు నీరజ్ అర్హత సాధించాడు. గత ఏడాది డైమండ్ లీగ్ చాంపియన్ అయిన నీరజ్...ఈ సీజన్‌లో దోహా, లాసానేలలో అగ్రస్థానం సాధించాడు. గాయం కారణంగా అతను మొనాకో మీట్‌లో పాల్గొనలేకపోయాడు. సెప్టెంబర్ 17నుంచి యూగీన్ (అమెరికా)లో ఫైనల్స్ జరుగుతుంది. ఇతర ఫలితాల్లో లాంగ్‌జంప్‌లో మురళీ శంకర్ ఐదో స్థానంలో నిలిచాడు. అతనూ ఫైనల్స్‌కు అర్హత సాధించడంలో సఫలమయ్యాడు.



జ్యూరిచ్‌లో తన ప్రదర్శన పట్ల నీరజ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. వరల్డ్ చాంపియన్‌షిప్ తర్వాత తాను బాగా అలసిపోయానని, కాస్త భుజం నొప్పి కూడా ఇబ్బంది పెట్టిందని నీరజ్ వ్యాఖ్యానించాడు. ఫైనల్స్ సమయానికి తాను 100 శాతం ఫిట్‌గా ఉండాలని కోరుకుంటున్నట్లు అతను చెప్పాడు. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం నిలబెట్టుకోవడం కూడా తన లక్ష్యమని నీరజ్ వెల్లడించాడు.

నేడే 'ఆసియా' అసలు సమరం

భారత్, పాక్ ఢీకి సిద్ధం

- ఫేవరెట్‌గా రోహిత్ సేన
- నంబర్‌వన్ హోదాతో బాబర్ బృందం
- మ్యాచ్‌కు వానగండం
- మ.గం. 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం


ఆసియా కప్ ట్రోఫీతో గత ఏడాది (2022) భారత, పాకిస్తాన్ కెప్టెన్లు రోహిత్ శర్మ, బాబర్ ఆజమ్ (ఫైల్)

పల్లెకెలె: వన్డే ప్రపంచకప్‌కు ఇంకొన్ని రోజులే ఉంది. మెగా ఈవెంట్‌కు ముందు క్రికెట్ ప్రపంచం ఒళ్లంతా కళ్లు చేసుకునే కీలక మ్యాచ్ నేడు జరుగనుంది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ జట్లు సై అంటే సై అనే పోరుకు ఆసియా కప్ వన్డే టోర్నీ వేదికైంది. నంబర్‌వన్ పాక్, ఆసియా కప్ ఫేవరెట్ భారత్ మధ్య జరగబోయే ఈ పోరు టోర్నీకే హైలైట్‌గా నిలవడం ఈపాటికే ఖాయమైంది. కేవలం వన్డే ఫార్మాట్‌నే చూసుకుంటే గత వన్డే ప్రపంచకప్ తర్వాత ఇరు జట్లు తలపడే 50 ఓవర్ల పోటీ ఇదే! గతేడాది జరిగిన టి20 వరల్డ్‌కప్‌లో విరాట్ అద్భుత ప్రదర్శన తర్వాత ఇరు జట్లు ఇప్పుడు తలపడుతున్నాయి. మెల్‌బోర్న్ తరహాలో లంక గడ్డపై కూడా మరో హోరాహోరీ ఖాయం.

కొత్త ఉత్సాహంతో రోహిత్ బృందం

గత కొన్నాళ్లుగా స్వదేశంలో జరిగే ప్రపంచకప్ కోసం భారత్ చాలా ప్రయోగాలు చేసింది. రాహుల్, అయ్యర్, బుమ్రావంటి కీలక ఆటగాళ్ల గాయాల నేపథ్యంలో భారత టీమ్ మేనేజ్‌మెంట్ తగిన జాగ్రత్తలు తీసుకొని సీనియర్లు రోహిత్, కోహ్లిలకు బాగా విశ్రాంతినిస్తూ కాపాడుకుంటూ వచ్చింది. ఇక సమయం, సందర్భం రావడంతో టీమిండియా తురుపుముక్కలు బరిలోకి దిగుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది కచ్చితంగా 'ప్రి ప్రపంచకప్' పోటీనే! ఇందులో ఏ సందేహం లేదు. దాదాపు వరల్డ్‌కప్‌లో బరిలోకి దిగే జట్టును ఖాయం చేసేందుకు ఈ ఆసియా టోర్నీని జట్టు వాడుకుంటోంది. రోహిత్, కోహ్లిల ఫిట్‌నెస్, జట్టులోకి అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ జడేజా పునరాగమనం, మరో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, బౌలింగ్ దళపతి బుమ్రా, 'హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్' సిరాజ్ ఇలా చెప్పుకుంటూ పోతే భారత్ పూర్తి స్థాయి ప్రపంచకప్ సైన్యంతో రంగంలోకి దిగుతోంది. దీన్నిబట్టి చూస్తే పాక్ పనిపట్టేందుకు, ఆసియా కప్‌లో ఓడించేందుకు రోహిత్ సేనకు ఏమంత కష్టం కానేకాదు.

పుంజుకున్న బలంతో పాక్

కొంత కాలంగా ఇంటాబయటా నిలకడైన విజయాలు, గట్టి ప్రత్యర్థులను ఓడించిన తీరుతో బాబర్ ఆజమ్ సేన మునుపటి కంటే పుంజుకుంది. బ్యాటింగ్‌లో ఫఖర్–ఇమామ్ ఓపెనింగ్ జోడీ నుంచి ఏడో నంబర్ షాదాబ్ ఖాన్ వరకు బ్యాటింగ్ చేసే సత్తా పాకిస్తాన్ పటిష్టంగా నిలుపుతోంది. బౌలింగ్‌లో పేస్ త్రయం షాహీన్ అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్ ఆరంభంలో వికెట్లు పడగొట్టడంతో సఫలమవుతున్నారు. స్పిన్‌లో షాదాబ్, నవాజ్ సత్తా చాటుతుండటంతో పాకిస్తాన్ భారత్‌కు దీటుగా ఉంది. నంబర్‌వన్ హోదా అదనపు స్థైర్యాన్ని తెచ్చిపెట్టగా... రెట్టించిన ఉత్సాహంతో ప్రత్యర్థిని ఢీకొనేందుకు రెడీగా ఉంది.

గత ఐదు వన్డేల్లో...

భారత్, పాక్‌లు తలపడిన గత ఐదు వన్డేల్లో టీమిండియాదే 4–1తో పైచేయిగా ఉంది. 2017 చాంపియన్స్‌ట్రోఫీలో లీగ్ దశలో గెలిచి తుదిపోరులో భారత్ ఓడింది. 2018 ఆసియాకప్‌లో రెండుసార్లు టీమిండియా గెలిచింది. చివరిసారిగా గత వన్డే ప్రపంచకప్(2019)లోనూ భారత్‌దే గెలుపు.

పిచ్–వాతావరణం

ఇది కొత్త పిచ్. పక్కాగా దీనికే అనుకూలమని చెప్పలేం. లంక, బంగ్లా మధ్య జరిగినట్లే సీమర్లు, స్పిన్నర్లకు చక్కని చాన్స్! అయితే మ్యాచ్‌కు వాన ముప్పు పొంచివుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాన కురిసే అవకాశముండటంతో మ్యాచ్ మొదలయ్యేందుకు ఆలస్యం కావొచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), శుబ్‌మన్, కోహ్లి, అయ్యర్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, జడేజా, శార్దుల్ /షమీ, కుల్దీప్, సిరాజ్, బుమ్రా.

పాకిస్తాన్: బాబర్ ఆజమ్ (కెప్టెన్), ఫఖర్ జమాన్, ఇమామ్ ఉల్ హక్, రిజ్వాన్, ఆగా సల్మాన్, ఇఫ్తికార్, షాదాబ్‌ఖాన్, నవాజ్, షాహీన్ షా అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్.



మైదానంలో విరాట్ కోహ్లి, రవూఫ్ ముచ్చట్లు

'విషీ'ని దాటిన గుకేశ్

- 'ఫిడే' ర్యాంకింగ్స్‌లో భారత్ తరఫున నంబర్‌వన్
- 37 ఏళ్ల తర్వాత అగ్రస్థానం కోల్పోయిన ఆనంద్



చెన్నై: 1986 జులై 1... చదరంగ మేధావి విశ్వనాథన్ ఆనంద్ భారత నంబర్‌వన్ ఆటగాడిగా మొదటిసారి గుర్తింపు తెచ్చుకున్న రోజు. నాటినుంచి ఇప్పటి వరకు అతనిదే అగ్ర స్థానం. అతని తర్వాత భారత్‌నుంచి పెద్ద సంఖ్యలో కుర్రాళ్లు సత్తా చాటుతూ వచ్చినా... వారితో పోటీ పడుతూ సత్తా చాటిన ఆనంద్ 37 సంవత్సరాలుగా 'టాప్'లోనే నిలిచాడు. ఒక తరం పాటు ఆటను శాసించి ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన ఆనంద్ ఇప్పుడు తొలిసారి తన భారత నంబర్‌వన్ స్థానాన్ని కోల్పోయాడు. 17 ఏళ్ల దొమ్మరాజు గుకేశ్ ఇప్పుడు టాప్ ర్యాంక్‌లోకి వచ్చాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) శుక్రవారం అధికారికంగా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రకటించింది. ఇందులో గుకేశ్ 8వ ర్యాంక్‌లో నిలవగా... విశ్వనాథన్ ఆనంద్ 9వ ర్యాంక్‌లో ఉన్నాడు. గుకేశ్ రేటింగ్ 2758 కాగా, ఆనంద్ రేటింగ్ 2754గా ఉంది. ఇటీవల జరిగిన వరల్డ్ కప్ సమయంలోనే 'లైవ్ రేటింగ్'లో ఆనంద్‌ను గుకేశ్ అధిగమించాడు. అయితే ఇప్పుడు 'ఫిడే' ర్యాంకింగ్ ద్వారా అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. టాప్–30 ర్యాంకింగ్స్‌లో వీరిద్దరితో పాటు భారత్ నుంచి ఆర్. ప్రజ్ఞానంద (19), విదిత్ గుజరాతీ (27), అర్జున్ ఎరిగైశి (29) ఉండగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ 31వ స్థానంలో కొనసాగుతున్నాడు. 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల గ్రాండ్‌మాస్టర్‌గా మారిన గుకేశ్ అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు.

అల్‌కరాజ్, మెద్వెదెవ్ ముందంజ

- ఓటమితో జాన్ ఇస్నర్ రిటైర్
- యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్


కుమారుడితో ఇస్నర్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వరల్డ్ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)కు రెండో రౌండ్‌లో సునాయాస విజయం దక్కింది. ఈ మ్యాచ్‌లో టాప్ సీడ్ అల్‌కరాజ్ 6–3, 6–1, 7–6 (7/4)తో లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)ను ఓడించి మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) రెండో రౌండ్‌లో 6–2, 6–2, 6–7 (6/8), 6–2తో క్రిస్టోఫర్ కానెల్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. మూడు గ్రాండ్‌స్లామ్‌ల విజేత ఆండీ ముర్రే (బ్రిటన్) ఆట మాత్రం రెండో రౌండ్‌లోనే ముగిసింది. గ్రిగర్ దిమిత్రోవ్ (బల్గేరియా) 6–3, 6–4, 6–1తో ముర్రేను ఇంటి ముఖం పట్టించాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సబలెంకా (రష్యా) 6–3, 6–2తో జోడీ బురెజ్ (యూకే)ను...9వ సీడ్ వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6–2, 6–2తో ట్రెవిజాన్ (ఇటలీ)ను ఓడించి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.

టెన్నిస్ సర్క్యూట్‌లో సుదీర్ఘ మ్యాచ్‌లకు చిరునామాగా నిలిచిన జాన్ ఇస్నర్ (అమెరికా) రెండో రౌండ్‌లో మరో సుదీర్ఘ సమరంలో ఓడి ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. 3 గంటల 57 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో అమెరికాకే చెందిన మైకేల్ మో 3–6, 4–6, 7–6 (7/3), 6–4, 7–6 (10/7) స్కోరుతో ఇస్నర్‌ను ఓడించాడు. టెన్నిస్ చరిత్రలో సుదీర్ఘ మ్యాచ్ (11 గంటల 5 నిమిషాల పాటు – నికోలస్ మహుత్‌తో) ఆడిన రికార్డులో ఇస్నర్ భాగం కాగా...అత్యధిక ఏస్‌లు (14,470) కొట్టిన ఘనత కూడా అతని సొంతం. **పురుషుల డబుల్స్‌లో ఇద్దరు భారత ఆటగాళ్ల పోరు తొలి రౌండ్‌లోనే ముగిసింది. యూకీ బాంబ్రీ (భారత్) – డెమోలినర్ (బ్రెజిల్) జోడి 3–6, 5–7తో హ్యూగో నిస్ (మొనాకో) – జిలిన్‌స్కీ (పోలాండ్) చేతిలో... సాకేత్ మైనేని (భారత్) – కరట్‌సెవ్ (రష్యా) ద్వయం 7–6 (7/4), 3–6, 2–6తో లాస్లో జెరె (సెర్బియా) – హ్యూస్టర్ (స్విట్జర్లాండ్) చేతిలో ఓడారు.**